AKSHARA TODAY
అక్షర టుడే
TOWARDS... TRUTH, TRUST, TREND
WWW.AKSHARATODAY.IN
19-2-2026 (Thursday)
MAIN EDITION

## ఐపీవోకు క్లీన్ మాక్స్ ఎన్విరో ఎనర్జీ




**అక్షరటుడే, బిజినెస్‌డెస్క్:** పునరుత్పాదక ఇంధన సరఫరాదారుల పరంగా క్లీన్ మాక్స్ ఎన్విరో ప్రముఖ కంపెనీలలో ఒకటి. క్లీన్ మాక్స్ ఎన్విరో ఎనర్జీ సొల్యూషన్స్ లిమిటెడ్ మొదట మహారాష్ట్రలోని ముంబయిలో 2010లో ప్రారంభమైంది. వాణిజ్య, పారిశ్రామిక పునరుత్పాదక విద్యుత్ ప్రాజెక్టులను అభివృద్ధి చేయడం, విద్యుత్ ఉత్పత్తి, అమ్మకాల్లో ఈ కంపెనీ నిమగ్నమై ఉంది. దేశీయంగానే కాకుండా దుబాయి, థాయిలాండ్, బ్యాంకాక్, బహ్రెయిన్‌లలోనూ సేవలందిస్తోంది. కంపెనీ రూ.3,100 కోట్లు సేకరించడానికి ఐపీవోకు వస్తోంది. తాజా షేర్ల జారీ ద్వారా రూ. 1,200 కోట్లు, ఆఫర్ ఫర్ సేల్ ద్వారా రూ. 1,900 కోట్లు సమీకరించనుంది.

## కర్రెగుట్టల్లో భారీ ఎన్‌కౌంటర్..




**అక్షరటుడే, నేషనల్‌డెస్క్:** తెలంగాణ, ఛత్తీస్‌గఢ్ సరిహద్దులోని కర్రెగుట్టల్లో భారీ ఎన్‌కౌంటర్ చోటు చేసుకుంది. ఈ ఘటనలో ఐదుగురు మావోయిస్టులు మృతి చెందారు. మృతుల్లో అగ్రనేతలు ఉన్నట్లు సమాచారం. కర్రెగుట్టల్లో భారీగా మావోయిస్టులు ఉన్నారనే సమాచారం మేరకు ఛత్తీస్‌గఢ్ పోలీసులు, భద్రత బలగాలు కూంబింగ్ చేపట్టాయి. ఈ క్రమంలో గురువారం బలగాలపై మావోయిస్టులు కాల్పులు జరిపారు. దీంతో బలగాలు ఎదురు కాల్పులు చోటు చేసుకున్నాయి. ఈ క్రమంలో ఐదుగురు మావోయిస్టులు మృతి చెందారు.

## మళ్లీ పెరిగిన బంగారం ధరలు



**అక్షరటుడే, బిజినెస్ డెస్క్:** బంగారం, వెండి ధరలు మరోసారి షాకిచ్చాయి. ఒక్కసారిగా పెరిగాయి. హైదరాబాద్‌లో తులం బంగారంపై ఒక్కరోజులో రూ.3,470 పెరిగింది. కిలో వెండిపై ఏకంగా రూ.9,700 పెరిగింది. దీంతో ప్రస్తుతం మార్కెట్‌లో 24 క్యారెట్ల బంగారం 10 గ్రాముల ధర రూ.1,60,570గా ఉంది. 22 క్యారెట్ల బంగారం ధర రూ.1,47,000కు చేరింది.

## నల్లమలలో కార్చిచ్చు



**అక్షరటుడే, నాగర్‌కర్నూల్:** నల్లమల అడవుల్లో కార్చిచ్చు చెలరేగింది. నాగర్ కర్నూల్ జిల్లా అమ్రాబాద్ పులుల అభయారణ్యంలోని బ్రహ్మగిరి రేంజ్ పరిధిలో గల తాటిగుండాల సమీపంలో నిప్పు రాజుకుంది. అనంతరం మంటలు వేగంగా వ్యాపించాయి. సమాచారం అందుకున్న అటవీ, అగ్నిమాపక సిబ్బంది మంటలు ఆర్పడానికి చర్యలు చేపట్టారు.

## గూగుల్ పిక్సెల్ 10ఏ విడుదల..



**అక్షరటుడే, బిజినెస్‌డెస్క్:** టెక్ దిగ్గజం గూగుల్.. మరో మోడల్‌ను తీసుకువచ్చింది. పిక్సెల్ 10ఏను గ్లోబల్ మార్కెట్‌లో లాంచ్ చేసింది. వచ్చేనెల నుంచి అమ్మకాలు ప్రారంభం కానున్నాయి. గూగుల్ మిడ్ రేంజ్ ప్రీమియం స్మార్ట్‌ఫోన్ 'గూగుల్ పిక్సెల్ 10ఏ'ను రిలీజ్ అయింది. రూ. 49,999 ధరలో అందుబాటులో ఉండనుంది.

## 26 నుంచి బడ్జెట్ సమావేశాలు

**అక్షరటుడే, హైదరాబాద్:** తెలంగాణ బడ్జెట్ సమావేశాలు ఈ నెల 26 నుంచి ప్రారంభం కానున్నాయి. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క 28న అసెంబ్లీలో బడ్జెట్ ప్రవేశ పెట్టనున్నారు. తెలంగాణ బడ్జెట్‌పై ప్రభుత్వం తీవ్రంగా కసరత్తు చేస్తోంది. ఈ క్రమంలో ఈ నెల 26 నుంచి సమావేశాలు నిర్వహించనుంది. 10 నుంచి 15 రోజుల పాటు సభ నిర్వహించనున్నట్లు సమాచారం. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ప్రవేశ పెడుతున్న మూడో బడ్జెట్ కావడంతో దీనిపై ప్రజలు ఆశలు పెట్టుకున్నారు. అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తూనే, సంక్షేమానికి పెద్దపీట వేయాలని ప్రభుత్వం యోచిస్తున్నట్లు సమాచారం.

**తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత కొత్త పార్టీ ముహూర్తం ఖరారు అయింది. మేలో పార్టీని ప్రకటిస్తానని ఆమె తెలిపారు. జూబ్లీహిల్స్ లోని జాగృతి కార్యాలయంలో ఆమె మీడియా చిట్ చాట్‌లో మాట్లాడారు. పార్టీ పేరులో తెలంగాణ అనే పదం ఉంటుందన్నారు. తాను సిద్దిపేట నుంచి పోటీ చేస్తానని, లేదంటే బోధన్‌లో బరిలో నిలుస్తానని ఆమె పేర్కొన్నారు.**

—అక్షరటుడే, హైదరాబాద్ ప్రతినిధి



# మేలో కొత్త పార్టీ

**■ సిద్దిపేట నుంచి పోటీ చేస్తా ■ కల్వకుంట్ల కవిత కీలక ప్రకటన**

బీఆర్ఎస్ నుంచి సస్పెండ్ అయిన తర్వాత కవిత తెలంగాణ జాగృతిపై ఫోకస్ పెట్టిన విషయం తెలిసిందే. జాగృతి సంస్థను బలోపేతం చేస్తూనే కొత్త పార్టీ ఏర్పాటు కోసం ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ క్రమంలో తాజాగా పార్టీ ఏర్పాటుపై ప్రకటన చేశారు. మే మొదటి వారంలో పార్టీ ప్రకటించాలని చూస్తున్నట్లు తెలిపారు. ముహూర్తం కోసం ఎదురుచూస్తున్నామని చెప్పారు.

### అధికారంలోకి వస్తాం


కవిత కొద్ది రోజులుగా మాజీ మంత్రి హరీశ్‌రావుపై విమర్శలు చేస్తున్న విషయం తెలిసిందే. బతుకమ్మ వేడుకల్లో సైతం ఆమె తన తండ్రి స్వగ్రామం అయిన సిద్దిపేట జిల్లా చింతమడకలో పాల్గొన్నారు. హరీశ్‌రావును గుంట నక్క అని పలుమార్లు విమర్శించారు. ఈ క్రమంలో తాజాగా తాను అసెంబ్లీ ఎన్నికల్లో సిద్దిపేట నుంచి పోటీ చేస్తానని కవిత ప్రకటించారు. సెకండ్ ఛాయిస్‌గా బోధన్‌ను ఎంచుకుంటానని చెప్పారు. రాబోయే రోజుల్లో రాష్ట్రంలో బీజేపీ, బీఆర్ఎస్ ఉండవన్నారు. ప్రధాన ప్రతిపక్షంగా జాగృతి ఉంటుందని స్పష్టం చేశారు. తాము పక్కా అధికారంలోకి వస్తామని ధీమా వ్యక్తం చేశారు. వైఎస్ షర్మిలను కవిత ఇందిరా గాంధీతో పోల్చారు. ఏపీలో షర్మిల ఫెయిల్ అవ్వలేదన్నారు. ఆమె ఎన్నో ప్రయత్నాలు చేసి ఇప్పుడు ఒక జాతీయ పార్టీకి రాష్ట్ర అధ్యక్షురాలు అయిందని చెప్పారు.

### కార్మికులపై పనిభారం

మహాలక్ష్మి పథకంతో బస్సుల్లో ఆక్యుపెన్సీ పెరిగిందని కవిత చెప్పారు. దీంతో కార్మికులు పనిభారంతో ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వారికి తగిన విశ్రాంతి ఇవ్వాలని డిమాండ్ చేశారు. శ్రమ దోపిడీకి పాల్పడుతున్న ప్రభుత్వం ఆర్టీసీ కార్మికులను ఆదుకోవడం లేదని విమర్శించారు. చిన్న చిన్న కారణాలతో డ్రైవర్లు, కండక్టర్లను తొలగిస్తున్నారని ఆరోపించారు. మహాలక్ష్మి పథకంలో భాగంగా ఆర్టీసీకి ఇప్పటి వరకు ప్రభుత్వం ఎంత చెల్లించిందో శ్వేత పత్రం విడుదల చేయాలని డిమాండ్‌చేశారు. ఆర్టీసీని నిర్వీర్యం చేసేందుకు ప్రభుత్వం కుట్ర చేస్తోందన్నారు.

### సచివాలయాన్ని ముట్టడిస్తాం

ఆర్టీసీ కార్మికుల సమస్యలపై జాగృతి కార్యాలయంలో కవిత మీడియాతో మాట్లాడారు. వెయ్యి మంది ఆర్టీసీ కార్మికులను సంస్థ అన్యాయంగా తీసేసిందన్నారు. జాగృతి డిమాండ్ చేస్తే అందులో 300 మందిని మాత్రమే తిరిగి విధుల్లో చేర్చుకున్నారని చెప్పారు. మిగిలిన వారిని కూడా త్వరితగతిన చేర్చుకోకపోతే ఈనెల 24న కార్మికులతో కలిసి సచివాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయాలన్నారు.



## హైదరాబాద్‌లో బాలికపై గ్యాంగ్‌రేప్


**అక్షరటుడే, హైదరాబాద్:** హైదరాబాద్ నగరంలో దారుణం చోటు చేసుకుంది. ఓ బాలికపై ముగ్గురు రౌడీ షీటర్లు సామూహిక అత్యాచారం చేశారు. నార్సింగి పోలీస్ స్టేషన్ పరిధిలో ఈ ఘటన చోసుకుంది. అపస్మారక స్థితిలో ఉన్న బాలికను స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. దీంతో ఘటనా స్థలానికి చేరుకుని బాలికను వైద్య పరీక్షల కోసం గాంధీ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

## ఏఐసీసీ పెద్దలతో సీఎం, మంత్రుల సమావేశం




**అక్షరటుడే, ఢిల్లీ:** సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు గురువారం ఢిల్లీలో కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీతో సమావేశమయ్యారు. ఏఐసీసీ సెక్రెటరీ కేసీ వేణుగోపాల్, కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జి మీనాక్షి నటరాజన్ సైతం పాల్గొన్నారు. పంచాయతీ, మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం, రాష్ట్రంలో పాలనపై వారు చర్చించారు. మంత్రివర్గ విస్తరణ, నామినేటేడ్ పోస్టుల భర్తీపై సైతం చర్చ జరిగినట్లు సమాచారం. సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు పాల్గొన్నారు.

## ఏఐ రెండు వైపులా పదునున్న కత్తి: మోదీ



**అక్షరటుడే, ఢిల్లీ:** ఏఐలో విజన్‌తో పాటు సామాజిక బాధ్యత కూడా చాలా ముఖ్యమని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. మనం అణుశక్తి విధ్వంసాన్ని చూశాం, వికాసాన్ని చూశామని చెప్పారు. ఏఐ కూడా అంతే అన్నారు. ఏఐ కత్తికి రెండు వైపులా పదునున్న అస్త్రం అని పేర్కొన్నారు. దానిని మంచి కోసం వినియోగించాలని సూచించారు. ఢిల్లీలోని భారత్ మండపంలో ఇండియా ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్ 2026 కొనసాగుతోంది. ఈ సదస్సులో గురువారం ప్రధాని మోదీ 'మానవ్ విజన్ ఫర్ ఏఐ'ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఫ్రాన్స్ అధ్యక్షుడు మాక్రాన్, ఐక్యరాజ్య సమితి సెక్రెటరీ జనరల్, వివిధ దేశాల ప్రతినిధులు పాల్గొన్నారు. ప్రధాని మోదీ మాట్లాడుతూ.. కొత్త సాంకేతికతను భారత్ అందిపుచ్చుకుంటోందని చెప్పారు. ఏఐ సమ్మిట్ నిర్వహణ భారత్‌కే కాదు, దక్షిణాసియాకే గర్వకారణమన్నారు. ఏఐపై తొలినాళ్లలో అనేక సందేహాలు వచ్చాయని మోదీ అన్నారు. యువత ఇప్పుడు ఏఐని ప్రయోజనకరంగా ఉపయోగిస్తోందని చెప్పారు. కొత్త ఆవిష్కరణలకు ఈ వేదిక దోహదం చేస్తుందన్నారు. ఏఐ మెషీన్ సెంట్రిక్‌గా కాదు.. హ్యూమన్ సెంట్రిక్‌గా ఉండాలని ఆయన సూచించారు. కృత్రిమ మేధ మనల్ని శాసించొద్దని, మనం దానిని శాసించాలని చెప్పారు.

## కాలువలోకి దూసుకెళ్లిన కారు..



**అక్షరటుడే, నేషనల్‌డెస్క్:** ఉత్తరప్రదేశ్‌లోని మధురలో ఘోర రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. ఓ కారు కాలువలోకి దూసుకెళ్లగా నలుగురు యువకులు మృతి చెందారు. మధుర జిల్లాలో బుధవారం రాత్రి ఓ కారు అదుపు తప్పి కాలువలోకి దూసుకెళ్లింది. నిశ్చితార్థ వేడుకకు హాజరయ్యేందుకు వెళ్తుండగా ప్రమాదం చోటు చేసుకుంది. మగోర్రా పోలీస్ స్టేషన్ ప్రాంతంలోని నాగల దేవియ ప్రాంతంలో ఈ ప్రమాదం జరిగింది. ఇక్కడ ప్రమాదకరమైన మలుపు, భద్రతా చర్యలు లేకపోవడం ప్రమాదానికి ప్రధాన కారణమని భావిస్తున్నారు. ఈ ఘటనలో నలుగురు యువకులు అక్కడికక్కడే మృతి చెందారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని, కారును కాలువ నుంచి క్రేన్ సాయంతో బయటకు తీశారు.

## సెర్చ్ ఇంజిన్ మోసాలతో జాగ్రత్త: సీపీ




**అక్షరటుడే, హైదరాబాద్:** ప్రస్తుతం ప్రతి ఒక్కరి చేతిలో స్మార్ట్ ఫోన్ ఉంది. ఏ సమాచారం కావాలన్నా వెంటనే గూగుల్‌లో వెతుకుతాం. అయితే దీనిని సైబర్ నేరగాళ్లు తమకు అనుకూలంగా మార్చుకుంటున్నారు. స్పాన్సర్డ్ లింక్‌ల పేరిట మోసాలకు పాల్పడుతున్నారు. వీటి విషయంలో జాగ్రత్తగా ఉండాలని హైదరాబాద్ సీపీ సజ్జనార్ సూచించారు. సెర్చ్ ఇంజిన్లలో టాప్‌లో కనిపించే వెబ్‌సైట్లు లేదా 'స్పాన్సర్డ్' అని ఉన్న లింకులు అన్నీ సురక్షితమైనవి కావని సజ్జనార్ పేర్కొన్నారు. కేవలం సెర్చ్ ఫలితాల్లోపై కనిపించినంత మాత్రాన అది అసలైన వెబ్‌సైట్ అని గుడ్డిగా నమ్మితే మోసపోయే అవకాశం ఉందన్నారు.

## రాజమౌళికి ఉన్న విజన్ ఎవరికీ లేదు..



**సూపర్ స్టార్ మహేష్ బాబు కథానాయకుడిగా డైరెక్టర్ రాజమౌళి ప్రతిష్టాత్మకంగా తెరకెక్కిస్తున్న పాన్ వరల్డ్ మూవీ 'వారణాసి'. గ్లోబల్ బ్యూటీ ప్రియాంక చోప్రా హీరోయిన్‌గా నటిస్తుండగా కీలక పాత్రల్లో మలయాళ స్టార్ హీరో పృథ్వీరాజ్ సుకుమారన్ విలన్‌గా, మహేష్ తండ్రిగా ప్రకాష్ రాజ్ నటిస్తున్నారు. ఇదిలా ఉంటే 2019లో ది స్కై ఈజ్ పింక్ తరువాత బాలీవుడ్ సినిమాలకు గుడ్ బై చెప్పిన ప్రియాంక.. మళ్లీ ఇన్నేళ్ల విరామం తరువాత తిరిగి వారణాసి'తో ఇండియన్ మూవీస్‌లో రీఎంట్రీ ఇస్తోంది. అయితే ఈ బ్యూటీ జక్కన్న మూవీతో రీఎంట్రీ ఇవ్వడానికి పెద్ద రీజనే ఉందని టాక్. రీసెంట్‌గా ఓ ఇంటర్వ్యూలో ఆసక్తికర విషయాల్ని వెల్లడించింది. 'వారణాసి' మూవీపై తను ఎంత కాన్ఫిడెంట్‌గా ఉందో స్పష్టం చేసింది. 'రాజమౌళికి ఉన్న విజన్ ఎవరికీ లేదు. ఆయనతో వర్క్ చేయడం చాలా ఎగ్జైటింగ్‌గా ఉంది. నా కెరీర్‌పై ఈ సినిమా ప్రభావం ఎక్కువగా ఉంటుందని నమ్ముతు న్నాను.' అని చెప్పికొచ్చింది.**

—అక్షరటుడే, సినిమా డెస్క్

## క్రూడ్ ఆయిల్ ధరకు రెక్కలు..

**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** అంతర్జాతీయ మార్కెట్‌లో క్రూడ్ ఆయిల్ ధరలకు రెక్కలొచ్చాయి. ముఖ్యంగా పశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్తతలు కలవరపెడుతున్నాయి. గురువారం బ్యారెల్ ధర 70.53 డాలర్లు దాటింది. గతేడాది సెప్టెంబర్ 26 తర్వాత ధరలు ఈ స్థాయికి చేరడం ఇదే మొదటిసారి. చమురు ధరల పెరుగుదలకు భౌగోళిక రాజకీయ, ఆర్థిక అంశాలను కారణంగా భావిస్తున్నారు. ఇరాన్ అణు కార్యక్రమం విషయంలో అగ్రరాజ్యం యూఎస్ ఆగ్రహంతో ఉంది. ఇరు దేశాల మధ్య ఓవైపు చర్చలు జరుగుతుండగానే మరోవైపు దాడులకు అమెరికా సన్నాహాలు చేస్తోంది. చర్చలు విఫలమైతే ఇరాన్‌లోని అణు కేంద్రాలపై అమెరికా దాడులు చేయవచ్చన్న భయాలు నెలకొ న్నాయి. ప్రపంచ చమురు రవాణాలో దాదాపు 30 శాతం వరకు హర్మూజ్ జలసంధి ద్వారానే జరుగుతుంది. ఒకవేళ మధ్యప్రాచ్యంలో యుద్ధం జరిగితే ఇరాన్ ఈ జలసంధిని మూసివేసే అవకాశాలున్నాయని భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో చమురు ధరలకు రెక్కలొస్తున్నాయి.